క్లుప్తంగా

శాసన మండలి చైర్మన్‌కు ఘన స్వాగతం



విమానాశ్రయంలో చైర్మన్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : తిరుమల శ్రీవారి దర్శన నిమిత్తం శుక్రవారం సాయంత్రం విజయవాడ నుంచి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్ర శాసన మండలి చైర్మన్ మోషన్ రాజ్‌కు ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, డాక్టర్ బాబు పుష్ప గుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గంలో తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

ఉన్నంకు సత్కారం



ఉన్నంను సన్మానిస్తున్న శ్రీనివాసులు

శ్రీకాళహస్తి : వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించిన ఉన్నం వాసుదేవ నాయుడును శ్రీకాళహస్తి దేవస్థానం పాలక మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పట్టణంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కోవి చంద్రయ్యానాయుడు, స్వర్ణ మూర్తి, భాస్కర్ ముదిరాజ్, చంద్రరాజు సాధనమున్న రాయల్, బుల్లెట్ జయశ్యామ్ మాజీ కౌన్సిలర్ శరవణ కుమార్, కంట ఉదయ్ కుమార్, శ్రీవారి సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జీవనోపాధి ప్రణాళిక

సత్యవేడు : స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థిక అవసరాలకు తగ్గట్లు జీవనోపాధి ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఏపీఎం డాంగే యాదవ్ సూచించారు. శుక్రవారం స్త్రీశక్తి భవనంలో జీవనోపాధి ప్రణాళికపై ఎన్యూమరేటర్స్‌కు నాలుగు రోజుల శిక్షణ ప్రారంభం అయింది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి జీవనోపాధుల ప్రణాళికను రూపొందించుకునే బాధ్యత ఎన్యూమరేటర్స్‌పై ఉందన్నారు. కుటీర పరిశ్రమ ఏర్పాటుతో మహిళల జీవనోపాధి పెరుగుతుందన్నారు. సమావేశంలో వెలుగు కోఆర్డినేటర్లు మధుసూదన్‌రెడ్డి, శివ కుమార్, మంగయ్య, పురుషోత్తం, కాంచన, ఎన్యూమేటర్లు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం జీవగ్రంలోని పీఎం హైస్కూల్‌లో చదువుతున్న 50 మంది విద్యార్థులకు శుక్రవారం చేయూత సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆశా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు సెల్ ఫోన్లకు దూరంగా ఉండి చదువుకు చేరువవ్వాలని కోరారు. పీఎం హైస్కూల్లో దేశం గర్వించదగ్గ వ్యక్తులు చదువుకున్నారని వారిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. హెచ్‌ఎం మేరీ, చేయూత సోషల్ సర్వీస్ కార్యదర్శి శ్రీనివాసులు, ఉపాధ్యాయులు కె.పి. సుభాకర్, హైమావతి, ఆనంద్, ప్రసన్న పాల్గొన్నారు.

నివాళి



మునీంద్రబాబుకు నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి : పట్టణంలోని కొండమిట్టకు చెందిన పనపాకం మునీంద్రబాబు గురువారం రాత్రి మృతి చెందాడు. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి శుక్రవారం ఉదయం అక్కడికి చేరుకుని ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ నాయకులు శరవణ కుమార్, సురావారి సురేష్, కంఠా ఉదయ్‌కుమార్, మున్నా రాయల్, బుల్లెట్ జయశ్యామ్, పెరుమాల్, ఆశాకిరణ్, జీవీకేరెడ్డి పాల్గొన్నారు.

అరుణ శోకం

- వ్యర్థాలు, రంగునీళ్లతో నది కాలుష్యం
- మురుగునీటిని నదిలో వదులుతున్న వైనం
- తాగునీరు కలుషితం
- ఉనికి కోల్పోతున్న అరుణానది

నారాయణవనం : మండల కేంద్రమైన నారాయణవనంలో వ్యర్థాలు, మురుగు, రంగు నీళ్లతో అరుణానది కాలుష్యానికి గురవుతూ.. మరోవైపు ఇసుకాసురులు ఇసుకను తోడేయడంతో చుక్కనీరు ఇంకే పరిస్థితి లేక భూగర్భ జలమట్టం తరిగిపోయే ప్రమాదం పొంచి ఉంది. కంచే చేను మేసిన చందంగా మురుగు నీటిని పంచాయతీ అధికారులు నదిలోకి వదలడంతో పాటు వ్యర్థాలను పడేస్తున్నారు. రంగు, మురుగు నీటి ప్రభావంతో నది పరీవాహక ప్రాంతాల తాగునీటి బోర్లు కాలుష్య కోరల్లో చిక్కు



నిరుపయోగంగా రాజీవ్ టెక్నాలజీ ట్యాంకులు

కొని తాగునీరు కలుషితం అవుతున్నాయి. మండల కేంద్రమైన నారాయణవనంలోని నూలు రంగు అద్దకం పరిశ్రమల నుంచి రోజూ రసాయనాలు అరుణానదిలోకే కలుస్తున్నాయి. సుమారు పది చిన్న, పెద్ద పరిశ్రమలు ట్రీట్‌మెంట్ యూనిట్లను ఏర్పాటు చేయకుండానే రంగు నీటిని అరుణానదిలోకి వదిలేస్తున్నారు. ఈ రోడ్‌కు చెందిన కొందరు



నారాయణవనంలో డంపింగ్ యార్డును తలపిస్తున్న అరుణానది

నారాయణవనంలో ఏర్పాటు చేసిన అద్దకం పరిశ్రమలో మోతాదుకు మించి ఘాడమైన రంగులను వాడటంతో నదిలో చేపలు మృతి చెందినప్పటికీ స్పందన కరువైంది. దీంతో రంగు పరిశ్రమలపై నియంత్రణ లోపించడంతో నదీ జలాలు, జలచరాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

మురుగు నీరు, వ్యర్థాలు నదిలోనే..

నారాయణవనం, సముదాయం, అరణ్యకండ్రిగ తదితర పంచాయతీలలో వ్యర్థాలకు నది డంపింగ్ యార్డ్‌గా మారింది. పేరుకు మాత్రమే చెత్త నుంచి సంపద కేంద్రాలు నిర్మించారే తప్ప వర్మీకంపోస్ట్ ఎరువులను తయారు చేయడంపై శ్రద్ధ చూపడంలేదు. తడి, పొడి చెత్తతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసి రీసైక్లింగ్ చేయడం, వర్మీకంపోస్ట్ ఎరువుల తయారీతో ఆదాయాన్ని పెంచుకోవడంలో పంచాయతీలు శ్రద్ధ చూపకపోవడం అరుణానదికి శాపంగా మారింది. నది కాలుష్యం



నారాయణవనంలో నదిలోకి పారుతున్న రంగు, మురుగు నీరు

కావడంతో తాగునీటిని అందించే రాజీవ్ టెక్నాలజీ మిషన్ పథకాన్ని శాశ్వతంగా ఆపివేశారు.

ఇష్టారాజ్యంగా ఇసుక తవ్వకాలు

నీటి నిల్వ, భూగర్భ జల మట్టాన్ని పెంచడానికి మూలాధారమైన ఇసుకను అరుణానది నుంచి పూర్తిగా తోడేశారు. నదిలోకి చేరే చుక్క నీరు ఇంకక పోగా దిగువకు వెళ్లిపోతోంది. ఇసుక లేకపోవడంతో నదిలో ముళ్ల చెట్లు ఏపుగా పెరిగిపోవడంతో నది స్వరూపమే మారిపోయింది. భవిష్యత్తులో అరుణానది పారుతుండేదని చెప్పుకోవాలే తప్ప చూడలేని పరిస్థితి నెలకొనే దుస్థితి దాపురించింది. సంబంధిత అధికారులు స్పందించి నది ఉనికిని కాపాడాలని నదీ పరీవాహక రైతులు, స్థానికులు కోరుతున్నారు.

నియంత్రణకు కృషి చేస్తాం

మండలంలో ఇప్పటికే బృందావనాలను పూర్తి స్థాయిలో వినియోగిస్తున్నాం. అరుణానదిలో వ్యర్థాలు పడవేయకుండా సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు సూచనలు ఇస్తాం. నదిలో వ్యర్థాలు డంప్ చేయకుండా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ వేణయ్య, ఈవోపీఆర్డీ, నారాయణవనం

సంబంధిత శాఖలకు నివేదిస్తాం

అరుణానది కాలుష్యానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉంది. ఉచిత ఇసుక పాలసీ అమలులో ఉన్నందున ఇసుక తరలింపును అడ్డుకోలేం. మురుగునీరు, రంగు నీరు నదిలో కలవకుండా సంబంధిత శాఖలకు చర్యలు నిమిత్తం నివేదిస్తాం.

– జయరాములు, తహసీల్దార్, నారాయణవనం

దాతలకు సన్మానం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ రూఫ్ టాప్ నందు వాటర్ లీకేజీ పనులను పూణేకు చెందిన వెంకీస్ గ్రూప్ రూ.5 కోట్ల వ్యయంతో ఉచితంగా పనులు చేయించారు. పనులు పూర్తయిన సందర్భంగా శుక్రవారం శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ఆ సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజరు వివబూల్, ఢిల్లీ విశ్రాంత ఏఎస్ఐ జామ్‌వాల్‌ను సత్కరించి జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కాలువలో వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట పట్టణంలోని మాతమ్మ గుడి ఎదురుగా కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలపై 'స్వచ్ఛ నిర్లక్ష్యం' శీర్షికతో సాక్షిలో శుక్రవారం కథనం ప్రచురితం అయింది. దీనికి స్పందించిన అధికారులు వెంటనే పారిశుద్ధ్య కార్మికులతో కాలువలోని వ్యర్థాలను తొలగించారు. తాత్కాలిక పనులు కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.



కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్న పారిశుద్ధ్య సిబ్బంది

పంటల ప్రణాళిక రూపొందించాలి

నాగలాపురం : ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ, వాటి అనుబంధశాఖల అధికారులు సమావేశమై ఖరీఫ్ సీజన్‌లో పండించే పంటలపై ప్రణాళిక రూపొందించడంతో పాటు ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై చర్చించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మాట్లాడుతూ.. ప్రకృతి వ్యవసాయం వల్ల భూమికి, రైతులు, వినియోగదారులకు మేలు జరుగుతుందన్నారు. అనంతరం రైతులకు వ్యవసాయ పనిముట్లను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు హనుమాన్ నాయక్, ఎంపీడీఓ బాలాజీ



వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నాయక్, వ్యవసాయశాఖ ఏడీఏ సుబ్రహ్మణ్యం, ఏఓ సుబ్బారావు, డివిజన్, ఎన్.ఎఫ్.ఏ నీలమ్మ, ఏపీఎం సీతారాం, టీడీపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస యాదవ్, నాయకులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా ఇసుక తరలింపు

- గ్రామస్తులు అడ్డుకున్న వైనం
- పట్టించుకోని అధికారులు

శ్రీకాళహస్తి : అధికార పార్టీ అండదండలతో నిబంధనలు ఉల్లంఘించి తొట్టంబేడు మండలం పెన్నలపాడు వద్ద శుక్రవారం యంత్రాలతో ఇసుకను యథేచ్ఛగా తవ్వుతుంటే గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా.. కొంత కాలంగా వర్షాలతో ఈ ప్రాంతంలో నీరు



బారులు తీరిన ఇసుక ట్రాక్టర్లు



జేసీబీని అడ్డుకున్న గ్రామస్తులు

నిలిచి ఉంది. నీరు తగ్గుముఖం పట్టడంతో ఇసుకాసురులు రెచ్చిపోయారు. భారీ యంత్రాలతో బారులు తీరిన ట్రాక్టర్లకు ఇసుక నింపి తరలిస్తున్నారు. పోలీసు, రెవెన్యూ అధికారులు పరోక్షంగా ఈ అక్రమ రవాణాకు మద్దతు పలకడంతో ఇష్టానుసారంగా తవ్వకాలు చేస్తున్నారు. దీంతో భూగర్భ జలాలు భారీగా తగ్గిపోతాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో స్వర్ణముఖి నదిలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లకు అడ్డుగా నిలబడ్డారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయినప్పటికీ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

లాంగ్ మార్చ్‌ను జయప్రదం చేయండి

శ్రీకాళహస్తి : ఢిల్లీలో ఏప్రిల్ 11న జరిగే లాంగ్ మార్చ్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ తిరుపతి జిల్లా కార్యదర్శి తాలేటి రామచంద్ర పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలో గోడ పత్రికలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు, ప్రజా సంఘం నాయకులు పాల్గొన్నారు.

పులి మస్తాన్ సేవలు చిరస్మరణీయం

శ్రీకాళహస్తి : నియోజకవర్గంలో దళిత నేత పులి మస్తాన్ పేద ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమని పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం పులి మస్తాన్ 9వ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని అంబేడ్కర్ కూడలి వద్ద ఆయన కుమారుడు పులి శ్రీకాంత్‌తో కలిసి చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో జనమాల గురవయ్య, అంకయ్య, అల్లం మణి పాల్గొన్నారు.

నేడు ఇఫ్తార్ విందు

వరదయ్యపాళెం : మండల కేంద్రమైన వరదయ్యపాళెంలోని పెద్ద మసీదులో శనివారం సాయంత్రం ఇఫ్తార్ విందు నిర్వహించనున్నట్లు మైనారిటీ సెల్ నాయకులు శుక్రవారం తెలిపారు. ఈ విందుకు స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం హాజరు కానున్నట్లు వివరించారు.

ఆ సచివాలయానికి తీవ్ర పోటీ !

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలంలోని ఆ సచివాలయంలో కార్యదర్శి స్థానానికి డిమాండ్ ఎక్కువైంది. పలువురు కార్యదర్శులు ఆ స్థానానికి రావడానికి టీడీపీ నాయకుల వద్ద రాయబారాలు నడిపిస్తూ ఎలాగైనా ఆ స్థానంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. రేణిగుంట మండలంలోని గురవరాజు పల్లి సచివాలయంలో పనిచేస్తున్న కార్యదర్శి గ్రేడ్ 5 నుంచి గ్రేడ్ 4కి పదోన్నతి కల్పించారు. అందువల్ల ఖాళీ అవుతున్న సచివాలయ కార్యదర్శి స్థానానికి రావడానికి పలువురు ఆసక్తి చూపుతున్నారు. తిరుపతి– శ్రీకాళహస్తి ప్రధాన రహదారికి ఆనుకొని రేణిగుంట సమీపంలో ఉండడంతో ఆ పంచాయతీలో పనిచేయాలని పలువురు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. స్థానిక టీడీపీ నాయకుల ద్వారా మండల నాయకులను ప్రసన్నం చేసుకొని ఎమ్మెల్యే ఆశీస్సుల కోసం పలువురు కార్యదర్శులు వెళ్లారని గుసగుసలు వినపడుతున్నాయి. గ్రామంలోని అధికార పక్షంలో రెండు వర్గాలు ఉండటంతో ఒక వర్గం ఒకరిని, మరొక వర్గం మరొకరిని తీసుకొని వెళ్లారని సమాచారం. పంచాయతీరాజ్ డివిజన్ స్థాయి అధికారుల వద్ద లాబీయింగ్ చేసి ఎలాగైనా ఆ స్థానంలోకి వచ్చి తమ పంతాన్ని నెగ్గించుకోవాలని ఒకరిద్దరూ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారని, ఒకటి రెండు రోజుల్లో ఎవరు ఆ స్థానాన్ని దక్కించుకుంటారో, ఎవరికి టీడీపీ నాయకుల మద్దతు ఉంటుందో తెలుస్తుందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్

శ్రీకాళహస్తి : పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఘనంగా తృతీయ సంవత్సర విద్యార్థుల వీడ్కోలు సమావేశం, కళాశాల వార్షికోత్సవం జరిగింది. ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ.. జీవితంలో ధైర్యం, మేధస్సు, కష్టపడే తత్వం, లక్ష్య సాధన అనే నాలుగు అంశాలు పాటిస్తే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చన్నారు. విద్యార్థినులు తమ భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ దీనదయాల్, అధ్యాపకులు శివశంకర్‌నాయక్, శ్రీకాంత్‌రెడ్డి, ఉషారాణి, కుమారి, శైలజ, సాయి, వందన, సుమతి పాల్గొన్నారు.

ప్రియురాలితో సన్నిహితంగా ఉన్నాడని..!

- హత్యాయత్నం కేసులో ఫీల్డ్ అసిస్టెంట్ అరెస్టు

సత్యవేడు : వాహనంతో ఢీకొట్టి చంపడానికి ప్రయత్నించిన కేసులో సత్యవేడు మండలం కన్నావరం గ్రామానికి చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్ తేరువాయి భాస్కర్(44)ను శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పోలీసులు అరెస్టు చేశారు. సీఐ కథనం.. సత్యవేడు పంచాయతీ, ఉళవచేనుకు చెందిన కబడ్డీ క్రీడాకారుడు పవన్ ప్రాక్టీస్ కోసం నాగలాపురం మండలం, బీరకుప్పం వెళ్లేవాడు. ఇదేమార్గంలోని కన్నావరం దళితవాడకు చెందిన ఓ అమ్మాయితో పరిచయం ఏర్పడింది. అది ప్రేమగా మారింది. మూడేళ్లుగా వీరి ప్రేమ వ్యవహారం కొనసాగుతోంది. ఆ అమ్మాయి , పవన్ ఇద్దరూ ఇంటర్ పరీక్షలు పూర్తి చేసి వారివారి గ్రామాల్లో ఉంటున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ .. పవన్ ప్రేమించిన అమ్మాయి తల్లితో సన్నిహితంగా ఉండేవాడు.. అమ్మాయి విషయం తెలియడంతో పవన్‌ను హెచ్చరించాడు. ఆపై పవన్



సత్యవేడు సర్కిల్ కార్యాలయంలో నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

తనస్నేహితులైన కబడ్డీ ప్లేయర్లు భరత్ (సత్యవేడు), సారధి(బీరకుప్పం), ఉదయ్(బీరకుప్పం)కు విషయాన్ని చెప్పి భాస్కర్‌ను బెదిరించాలని నిర్ణయించాడు. ఈ క్రమంలో మార్చి 24న పవన్ తన స్నేహితుడైన భరత్‌తో కలసి ద్విచక్ర వాహనంపై బీరకుప్పం వెళ్లాడు. అక్కడ స్నేహితులు సారధి, ఉదయ్‌ని కలిసి భాస్కర్‌ను బెదిరించాలని మాట్లాడుకున్నారు. తర్వాత పవన్, భాస్కర్‌కు ఫోన్ చేసి బెదించాడు. అదేరోజు మధ్యాహ్నం తన స్నేహితులు ముగ్గురితో వచ్చి భాస్కర్‌తో గొడవకుదిగి కొట్టారు. ఇది తట్టుకోలేని ఫీల్డ్ అసిస్టెంట్ భాస్కర్ ప్రతీకారంగా పవన్‌ను మట్టు పెట్టాలని నిర్ణయించుకున్నాడు. అదేరోజు సాయంత్రం మినీ లగేజ్ వాన్ తీసుకుని సత్యవేడుకు వస్తుండగా మార్గమధ్యలో పవన్, అతని ముగ్గురు స్నేహితులతో కలిసి ఎదురుగా స్కూటీలో నిలిచి ఉండడం గుర్తించాడు. వెంటనే లగేజీ వాన్‌తో వారిని ఢీకొట్టాడు. నలుగురికీ గాయాలయ్యాయి. గాయపడిన పవన్ సత్యవేడు పోలీస్ స్టేషన్‌లో భాస్కర్‌పై ఫిర్యాదు చేశాడు. సీఐ మురళీనాయుడు ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేపట్టారు. వరదయ్యపాళెం ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఇదిలావుండగా ఇదే కేసుకు సంబంధించి శుక్రవారం బాధితుల కుటుంబాలకు చెందిన వారు సత్యవేడు పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన చేపట్టారు. తమ బిడ్డలను చంపాలనుకున్న భాస్కర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాస్టర్ మరణంపై సమగ్ర విచారణ చేపట్టాలి

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : పాస్టర్ ప్రవీణ్ మరణంపై ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించి న్యాయం జరిగేలా చూడాలని పరిశుద్ధ లూకా, లూథరన్ సంఘం పాస్టర్ కె.పి. లూథర్ బాబు కోరారు. రేణిగుంట మండలం గాజులమండ్యం పరిశుద్ధ లూకా, లూథరన్ సంఘం శుక్రవారం పాస్టర్ ప్రవీణ్ మరణంపై శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ కె. పి. లూథర్ బాబు మాట్లాడుతూ.. పాస్టర్ ప్రవీణ్‌ను ఎవరో కుట్ర చేసి హత్య చేసినట్లుగా అనుమానాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పరిశుద్ధ లూకా, లూథరన్ సంఘం అధ్యక్షుడు కె.యేసురత్నం, వెస్ ప్రెసిడెంట్ కె.పి.సతీష్ జయకర్, సెక్రటరీ నిర్మల చార్లస్, కోశాధికారి కె. పుష్పాంజలి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట మండలం వెదళ్ల చెరువు గ్రామంలో శుక్రవారం ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ నిపుణులు బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులకు అలవాటు పడిన రైతులు కొద్దికొద్దిగా పాత పద్ధతులలో ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. అనంతరం రైతులకు ఔషధ మొక్కల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆకాంక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవి బాబు, రాష్ట్ర లీగల్ సెల్ సెక్రటరీ ఉదయ్ కుమార్ రెడ్డి, ప్రకృతి వ్యవసాయ కార్యదర్శి స్వర్ణ కుమారి, ఈసీ మెంబర్ డాక్టర్ కోదండరామిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలకృష్ణారెడ్డి


వెల్‌నెస్ సెంటర్‌కు స్థల పరిశీలన

ఏర్పేడు (రేణిగుంట) : ఏర్పేడు మండలం మోదుగుల పాలెం గ్రామంలో శుక్రవారం వెల్నెస్ సెంటర్ కోసం డీఎంహెచ్ఓ డాక్టర్ బాలకృష్ణ నాయక్ స్థల పరిశీలన చేశారు. గ్రామ సర్పంచ్ జయరామయ్య మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఇచ్చిన వినతి మేరకు మంత్రి ఆదేశాలతో ఆయన గ్రామంలో రెండు స్థలాలు వెల్నెస్ కేంద్ర నిర్మాణం కోసం గుర్తించారు. అధికారులు ప్రతిపాదనలు పంపి భవన నిర్మాణం కోసం అవసరమైన నిధులు మంజూరుకు కృషి చేస్తానని ఆయన గ్రామస్తులకు తెలిపారు. ప్రస్తుతం ప్రైవేటు భవనంలో నడుపుతున్న ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి ఎంఎల్ హెచ్‌పీ కృష్ణవేణికి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో వైద్యాధికారి గిరిజాప్రకాశం , సీహెచ్ఓ శివరాజు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు దగ్ధం చేసి నిరసన

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : కూటమి ప్రభుత్వం ప్రస్తుతం విద్యుత్ చార్జీలు పెంచుతూ సామాన్య ప్రజల ఉసురు పోసుకుంటోందని వామపక్ష నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. వామపక్ష పార్టీలు రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు రేణిగుంట పట్టణంలోని విద్యుత్ కార్యాలయం ఎదుట వామపక్ష పార్టీలైన సీపీఐ, సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ కరెంట్ బిల్లులను దగ్ధం చేశారు. అనంతరం విద్యుత్ చార్జీలు తగ్గించాలని కోరుతూ విద్యుత్ అధికారులకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఎం కమిటీ కన్వీనర్ హరినాథ్ మాట్లాడుతూ.. తొమ్మిది నెలల్లోనే 15,450 కోట్ల రూపాయల విద్యుత్ భారాన్ని ప్రజలపైన మోపిందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు తులసి రాజన్, సీపీఎం సీనియర్ నాయకులు వెంకట రమణ, దిలీప్ బాషా, రేణిగుంట కార్యదర్శి ఈశ్వరమ్మ, మునస్వామి, భారతి, సులోచన, మహాలక్ష్మమ్మ, పద్మ, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

సత్యవేడు : విద్యుత్ చార్జీలు ఒక్క పైసా కూడా పెంచమని



విద్యుత్ కార్యాలయం ఎదుట బిల్లులను దగ్ధం చేస్తున్న వామపక్ష నాయకులు

చెప్పిన కూటమి ప్రభుత్వం కొత్త మీటర్లు పెట్టి భారీగా పెంచుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి రమేష్ ఆరోపించారు. శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. చార్జీల భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కృష్ణయ్య, సుబ్రమణ్యం, సెల్వం, ముత్తు, కేశవన్, రాధా, లక్ష్మీ సుశీల, రాణి పాల్గొన్నారు.